వారపు సంత.. ట్రాఫిక్ చింత

- కోటనందూరులో ప్రతి గురువారం సంత నిర్వహణ
- ప్రధాన రహదారికి ఇరువైపులా దుకాణాలు
- ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కోటనందూరు: మండల కేంద్రమైన కోటనందూరులో ప్రతి గురువారం వారపుసంత జరుగుతుంది. ఈ సంతలో దుకాణాలను గ్రామ ప్రధాన రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేస్తుండడంతో రాకపోకలకు స్థానికులతో పాటు వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒకప్పుడు ప్రత్యేక ప్రాంతంలో నిర్వహించే ఈ సంత స్థానిక మార్కెట్ ప్రాంతం నుంచి ఎస్‌బీఐ బ్రాంచి వరకూ రోడ్డుకు ఇరువైపులా విస్తరిస్తుండడంతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీంతో గురువారం సాయంత్రం వచ్చిందంటే ఈ రోడ్డు గుండా ప్రయాణించే వాహన చోదకులు బెంబేలెత్తిపోతున్నారు. గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించుకుపోయి తీవ్ర అసహనానికి గురవుతున్నారు. వారం వారం జరిగే సంతతో పరిస్థితి ఇంత దయనీయంగా మారుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జనజీవనానికి ఇబ్బంది లేని ప్రాంతానికి సంతను తరలించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కోటనందూరు సంతలో నిలిచిపోయిన ట్రాఫిక్

రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో..

కోటనందూరులో మార్కెట్ ప్రాంతం వద్ద గతంలో ఎవరికీ ఇబ్బంది లేని రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో వారపు సంత నిర్వహించేవారు. మాంసం, కూరగాయల దుకాణాలను వ్యాపారులు వేరువేరుగా ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేసుకునేవారు. ప్రధాన రహదారికి సంబంధం లేకుండా నిర్వహించే ఈ సంతతో జనజీవనానికి ఏమాత్రం ఇబ్బంది ఉండేది కాదు. గత పంచాయతీ పాలకుల స్వార్థపూరిత ఆలోచన స్థానికులకు, వాహన చోదకులను అవస్థలు తెచ్చిపెట్టింది. సంత నిర్వహించే ప్రాంతాన్ని అధికారమదంతో అడ్డగోలుగా విక్రయించేయడంతో సంత నిర్వహణకు సమస్యలు తలెత్తాయి. చేపల వ్యాపారులకు దుకాణాలు నిర్మించి ఇచ్చిన పంచాయతీ అధికారులు సంత నిర్వహణకు అనువైన ప్రాంతాన్ని మాత్రం చూపించలేదు. దీంతో వ్యాపారులు మరో గత్యంతరం లేక ప్రధాన రహదారికి ఇరువైపులా దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. సంత సమయంలో ప్రధాన రహదారిపై కనీసం ద్విచక్రవాహనాలు కూడా తప్పించుకునే పరిస్థితి లేకుండా పోతోంది. భారీ వాహనాలు ఎదురెదురుగా వస్తే గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది.

సంతలో భారీ రద్దీ

మండలంల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే సంతకు అధిక ప్రాధాన్యత ఉంది. దశాబ్దాలుగా నిర్వహిస్తున్న ఈ సంతకు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి కూరగాయలు, చేపలు, మాంసం క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. దీంతో సంత సమయంలో భారీ రద్దీ నెలకుంటోంది. సంత ఏర్పాటు చేసే రహదారి గుండా సుమారుగా 30 గ్రామాల ప్రజలకు, వాహన చోదకులతో పాటు ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి.

ప్రత్యామ్నాయ ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలి



ప్రధాన నడిరోడ్డుపై సంత నిర్వహించడం వల్ల గ్రామస్తులు, వాహనచోదకులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుపై ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. ప్రజలు అవస్థలు పడుతున్నా..పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. సంత నిర్వహణకు ప్రత్యామ్నాయ ప్రాంతాన్ని ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలి.

అయిల వీరబాబు, కోటనందూరు

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు



పేరవరంలో అవగాహన ర్యాలీ చేస్తున్న ఎంపీపీ బుజ్జి, రైతులు

ఏలేశ్వరం: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు జరుగుతుందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. మండలంలోని పేరవరంలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి వస్తుందన్నారు. రసాయన ఎరువుల వాడకం లేకుండా ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం వైపు వెళ్లేందుకు ప్రభుత్వం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసిందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్య యూనివర్సిటీకి ఐపీ, మ్యూజిక్ అవార్డు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీకి ఐపీ, మ్యూజిక్–2025 అవార్డు లభించినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును ప్రకటించినట్టు పేర్కొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం



మహిళా మార్కెట్‌లో వస్తువులను పరిశీలిస్తున్న టీఈ మంగాదేవి

తుని: మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అడుగులు వేస్తోందని జిల్లా మార్కెటింగ్ టీఈ మంగాదేవి అన్నారు. స్థానిక వీరవరపుపేట ఎలిమెంటరీ స్కూల్లో మెప్మా ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ఆమె సందర్శించారు. అక్కడ ప్రదర్శించిన వస్తువులు, సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించి మహిళలకు పలు సూచనలు చేశారు. వస్తువుల తయారీలో మరింత నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత రక్తదాన శిబిరం

జగ్గంపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో శనివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. కాకినాడ రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు రక్తాన్ని సేకరించారు. 50 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లే అన్నారు. రక్తదానం చేసిన ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం డైరెక్టర్ కొత్త కొండబాబు, తహసీల్దార్ జేవీఆర్ రమేష్, పలువురు అధికారులు, యూటీఎఫ్ నాయుకులు పాల్గొన్నారు.

రామేశంపేట వద్ద బ్రిడ్జి నిర్మించాలి



మంత్రికి సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి: మండలంలోని రామేశంపేట వద్ద పిల్లర్స్ బ్రిడ్జిను నిర్మించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి జనార్దన్‌రెడ్డిని కోరారు. ఏడీబీ రోడ్డు విస్తరణ పనులను శనివారం మంత్రి పరిశీలించారు. ఈ ప్రాంతంలో విద్యాసంస్థలు, హాస్టల్స్, స్టడీ సెంటర్స్ ఉన్నాయని, స్థానికులు, ప్రయాణికులు, వాహనదారుల సౌకర్యార్థం పిల్లర్స్ బ్రిడ్జిని నిర్మించాలని ఈ సందర్భంగా మంత్రిని ఎమ్మెల్యే కోరారు. మంత్రి వెంట పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్, స్థానిక నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, అధికారులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

అన్నవరం: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ముదునూరి మురళీ కృష్ణంరాజు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దడాల సతీష్, స్థానిక నాయకులు కొండపల్లి అప్పారావు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి సమన్వయంతో పని చేయాలి



కిర్లంపూడిలో ముద్రగడ గిరిబాబును కలిసిన వైస్సార్ సీపీ నాయకులు

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సూచించారు. కిర్లంపూడిలోని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ అడ్వైజరీ కమిటీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం నివాసంలో ముద్రగడ గిరిబాబును పెదశంకర్లపూడి మండల ఉపాధ్యక్షుడిగా నియమితులైన ఏలేటి శ్రీను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను గిరిబాబు శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యాక్రమంలో రౌతులపూడి మండలం రాజవరం సర్పంచ్ సోమరౌతు తిరుమల వెంకన్న దొర, మాజీ సర్పంచ్ అంకం రెడ్డి సతీష్, తుర్ల సత్తిబాబు, వివేక్ కీర్తి, దలే గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరమ్మతల్లి ఆలయ అర్చకురాలికి న్యాయం చేయాలి



సింగారమ్మ ఆలయం వద్ద ఆందోళన చేస్తున్న లిబరేషన్ పార్టీ నాయకులు

గోకవరం: నియోకవర్గంలోని జగ్గంపేట, గోకవరం మండలాల సరిహద్దుల్లో ఉన్న సింగారమ్మతల్లి ఆలయ అర్చకురాలికి న్యాయం చెయ్యాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జున్‌రావు డిమాండ్ చేశారు. ఆలయంలో అర్చకురాలిగా పనిచేస్తూ ఎన్నో దశాబ్దాలు నుంచి ఆలయ అభివృద్ధి పనులు చూస్తున్న వట్టికూటి సీతామహాలక్ష్మి ఇంటిని, కిరాణాషాపును ఇటీవల మల్లిసాలకు చెందిన టీడీపీ నాయకులు తొలగించారు. దీనిపై లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ఆలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్చకురాలు సీతామహాలక్ష్మి జీవనాధారం పొందుతున్న కిరణా షాపును, ఇంటిని కొందరు రాత్రికి రాత్రే ధ్వంసం చేశారని, ప్రశ్నిస్తే ప్రాణాలు తీస్తామని బెదిరించారన్నారు. ఈ ఘటనపై గోకవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టిసారించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరగని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జక్కంపూడి రాజా, నాగులపల్లి అచ్చారావు, దిమ్మిడి అప్పారావు, సిద్ధాబత్తుల అప్పారావు, ఆలయ అర్చకురాలి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రదీప్ సుందర్‌కు ఘన సత్కారం

గోకవరం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గత ఏడు సంవత్సరాలుగా ఆర్థోపెడిక్ డాక్టర్‌గా సేవలందించి పదోన్నతిపై రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ప్రదీప్‌సుందర్‌ను శనివారం ఆస్పత్రిలో ఘనంగా సన్మానించారు. ఆస్పత్రి ప్రధాన వైద్యురాలు డాక్టర్ వనజ కుమారి అధ్యక్షతన సత్కార సభ నిర్వహించారు. డాక్టర్లు, సిబ్బంది ప్రదీప్‌సుందర్‌ను పూలమాల, శాలువాతో సత్కరించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ ఝాన్సీ రాణి, డాక్టర్ రామలక్ష్మి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ దివ్య స్రవంతి, ఫిజియోథెరపీ నాగలలిత, డాక్టర్ కేదార్, హెడ్ నర్స్ లీల, ఎంపీహెచ్‌ఈఓ వైఎస్ రాయుడు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ సభ్యులు పెనుగొండ సత్యానందం, కర్రి సురారెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



డాక్టర్ ప్రదీప్‌సుందర్‌ను సత్కరించి, జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ అంతరాయం

తొండంగి: మండలంలోని గోపాలపట్నం, రావికంపాడు సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ వీరభద్రరావు శనివారం తెలిపారు. బెండపూడి, తమ్మయ్యపేట గ్రామాలకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్‌సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



గోకవరంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ధర్మవరంలో కొవ్వొత్తుల ర్యాలీ

ప్రత్తిపాడు రూరల్: జమ్మూకశ్మీర్‌లోని పెహల్గాంలో 27 మంది పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపడాన్ని నిరశిస్తూ మండలంలోని ధర్మవరంలో శనివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక జగనన్న కాలనీ నుంచి నంది సెంటర్ మీదుగా వినాయకుడి గుడి సెంటర్ వరకూ ర్యాలీ చేపట్టారు. తొలుత దాడిలో మృతి చెందిన పర్యాటకుల ఆత్మశాంతి చేకూరాలని కోరుతో మౌనం పాటించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూమితి వ్యక్తం చేశారు. మారణహోమానికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దొడ్డిపట్ల సోమన్న దొర, చుక్కల సత్యనారాయణ, ఊటా వీరబాబు, చక్కపల్లి ఆకాశ్, దొడ్డిపట్ల రాజబాబు, దాడి చిన్నారావు, దాడి రమణ, నక్కా శ్రీను, ఉప్పల తిరుపతిరావు, నానిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి హేయం

గోకవరం: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపడం హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం ఆదేశాల మేరకు గోకవరం పాతబస్టాండ్ సమీపంలో వైఎస్సార్ విగ్రహం వద్ద ఉగ్రవాదుల దాడికి నిరసనగా శనివారం కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. మృతుల ఆత్మశాంతికి మౌనం పాటించి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ఉగ్రవాదులు అమాయకులను పొట్టన పెట్టుకుంటున్నారన్నారు. భారతీయులపై ఇటువంటి దాడి జరగడం బాధాకరమన్నారు. భారతీయులంతా కులమతాలకు అతీతంగా ఐకమత్యంగా ఉండాలన్నారు. ఉగ్రవాదులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తలుపులమ్మతల్లి జాతర ప్రారంభం

తుని: లోవ తలుపులమ్మ అమ్మవారి గంధామావాస్య జాతర ఉత్సవాలు శనివారం ప్రారంభమైంది. దేవస్థానం గోపురం వద్ద గరగలను తీసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథరాజు కొబ్బరికాయ కొట్టి ఉత్సవాలను ప్రారంభించారు. తుని మండలం లోవకొత్తూరులో నమూనా ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఆదివారంతో జాతర ముగుస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామ పండుగ కావడంతో దూర ప్రాంతాల్లో ఉన్న స్థానికులు సొంత ఊరుకు చేరుకుంటున్నారు. పౌరాణిక ప్రదర్శనలు, సంగీత విభావరి (ఆర్కెస్ట్రా), డీజే, గరగల సంబరం, బళ్ల వేశాలు తదితర కార్యక్రమాలను దేవస్థానం ఏర్పాటు చేసింది. భక్తులకు ఇబ్బంది లేకుండా దేవస్థానం అధికారులు, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వాలీబాల్ టోర్నమెంట్ విజేత విశాఖ జట్టు

తొండంగి: మండలంలోని ఎల్లయ్యపేటలో రెండురోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ విజేతగా విశాఖపట్నం జట్టు నిలిచింది. ఎల్లయ్యపేటలో కాశీ అమ్మవారి జాతర సందర్భంగా గ్రామ పెద్దలు, దాతల సహకారంతో గ్రామానికి చెందిన మెర్లైన రాకెట్స్ వాలీబాల్ యూత్ ఆధ్వర్యంలో ఈ టోర్నీ నిర్వహించారు. ఫైనల్‌లో విశాఖపట్నం, కడప జట్లు తలపడగా విశాఖ జట్టు విజేతగా నిలిచింది. విన్నర్ జట్టుకు రూ.30 వేలు, ట్రోఫీ, రన్నర్స్ జట్టుకు రూ.20 వేలు ట్రోఫీలను అందజేశారు. మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.10 వేలు, రూ.5 వేలు నగదుతో పాటు ట్రోఫీలు ప్రదానం చేశారు.



ఎల్లయ్యపేటలో విజేత విశాఖ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

భవన నిర్మాణ అనుమతులు సులభతరం



కమిషనర్ సత్యనారాయణ

ఏలేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వీయ ధ్రువీకరణ పథకం–2025 ద్వారా భవన నిర్మాణ అనుమతులు సులభంగా పొందేందుకు అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ ఎం.సత్యనారాయణ తెలిపారు. ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడుతూ గృహ నిర్మాణం చేపట్టాలనుకునే యజమానులు స్వీయ ధ్రువీకరణ ద్వారా అనుమతులు పొందవచ్చన్నారు. దీనిలో భాగంగా లైసెన్సు టెక్నికల్ పర్సన్ లేదా సర్వేయర్, లేదా ఇంజినీర్ల ద్వారా గ్రామకంఠం, అధికార లే అవుట్, సర్క్యులేషన్, ప్యాట్రన్స్ ఆమోదం పొందిన ప్రాంతాల్లో నివాసం కోసం భవన నిర్మాణ అనుమతులు అత్యంత పారదర్శకంగా పొందవచ్చని తెలిపారు. ఆసక్తిగల అర్హులైన అభ్యర్థులు నగర పంచాయతీ కార్యాలయానికి నేరుగా లేదా ఏపీ ఓ.బి.పి.ఎస్/ఏపీ డి.పి.ఎం.ఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకొని లైసెన్సు పొందాలని ఆయన కోరారు.

చేతి పంపులకు మరమ్మతులు



చేతిపంపు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో చేతి పంపు బోర్లకు శనివారం మరమ్మతులు చేశారు. పలు ప్రాంతాల్లో బోర్లు పాడైపోవడంతో గ్రామ సర్పంచ్ ఈగల విజయదుర్గ ఆదేశాల మేరకు సిబ్బంది మరమ్మతు పనులు చేపట్టారు. ప్రస్తుత వేసవిలో ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మరమ్మతులు చేపట్టినట్లు సర్పంచ్ ఈగల విజయదుర్గ తెలిపారు.

తాటాకిల్లు దగ్ధం

గోకవరం: మండలంలోని కొత్తపల్లి ఎస్సీపేటలో శనివారం తాటాకిల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. స్థానిక ఎస్సీపేటకు చెందిన పంచాయతీ కార్మికుడు వందవాసి ధర్మరాజు తాటాకింట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో సామాగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ. లక్ష ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు.

డ్రగ్స్ రవాణాపై ఉక్కుపాదం



తుని జగన్నాథగిరి జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

- తుని రైల్వేస్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు

తుని: మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణలో భాగంగా తుని రైల్వేస్టేషన్‌లో శనివారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. లా అండ్ ఆర్డర్ డీఎస్పీ శ్రీహరిరాజు పర్యవేక్షణలో డ్రోన్ కెమెరాతో రైల్వేస్టేషన్ ప్రాంగాణాన్ని పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తుల బ్యాగులు, పార్శిల్ కార్యాలయంలో తనిఖీ చేశారు. ఆర్‌పీఎఫ్, జీఆర్పీ, లా అండ్ అర్డర్ శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. గంజాయి రవాణా, చోరీల నియంత్రణ తీసుకోవాలిన్సిన జాగ్రత్తలను డీఎస్పీ శ్రీహరిరాజు సూచించారు. తుని పట్టణ, రూరల్ సీఐలు గీతా రామకృష్ణ, చెన్నకేశవరావు, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీస్ అధికారులు

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

తుని: పదహారో నంబర్ జాతీయ రహదారిపై జగన్నాథగిరి జంక్షన్‌లో శనివారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో వానసాల తనిఖీలు నిర్వహించినట్టు తుని రూరల్ ఎస్సై కృష్ణమాచారి తెలిపారు. లైసెన్స్, వాహన రికార్డులను పరిశీలించారు. జాతీయ రహదారిపై దూరప్రాంతాలకు ప్రయాణించే వాహనాలు వేగ నియంత్రణతో పాటు మద్యం సేవించి నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

కిర్లంపూడి: ప్రభుత్వ నిషేధిత మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పెద్దాపురం సబ్‌డివిజనల్ పోలీస్ ఆఫీసర్ శ్రీహరిరాజు హెచ్చరించారు. నేరాల నిరోధన కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, జగ్గంపేట ఎస్సై రఘునాథరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



తుని రైల్వేస్టేషన్ పార్శిల్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

జగ్గంపేట: స్థానిక బస్టాండ్, పార్శిల్ ఆఫీసులు, ఇతర ప్రాంతాల్లో పోలీసులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పార్శిల్ ఆఫీసులో పలు వస్తువులు ఎవరికి వెళుతున్నాయి అనే దానిపై వివరాలు సేకరించారు. బస్టాండ్‌లో అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేశారు. కొంతమంది ప్రయాణికుల బ్యాగ్‌లు తనిఖీ చేశారు. కార్యక్రమంలో జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



జగ్గంపేట బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న జగ్గంపేట సీఐ శ్రీనివాస్